క్లుప్తంగా

రాచపోలమాంబ సతకంపట్టులో పూజలు



విశేష అలంకరణలో రాచపోలమాంబ అమ్మవారు

అల్లిపురం : అల్లిపురం మెయిన్ రోడ్డులో గల శ్రీ రాచపోలమాంబ అమ్మవారి సతకం పట్టు ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మరో రెండు రోజుల పాటు అమ్మవారి దేవాలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బొట్టా రమేష్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం : చావుల మదుము జంక్షన్‌లో గల బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని ఓ పెద్ద కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగుచూసింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి కాలువలో పడి వున్నట్లు స్థానికులు గుర్తించారు. అతని వివరాలు తెలియకపోవడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో నుంచి మృతదేహాన్ని వెలుపలకు తీశారు. వివరాలు తెలిసిన వారు 9440904716, 0891 2783672, 7981674667లో సంప్రదించాలని కోరారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో భక్తులు, అర్చకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు జిల్లాకు చెందిన కిల్లో లచ్చన్న, కాకినాడకు చెందిన గరికిన మెషేక్ అనే ఇద్దరు యువకులు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఎల్‌బీ గ్రౌండ్ సమీపంలో సంచరిస్తున్నారు. అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న వాద్దరినీ విచారించి, వారి బ్యాగ్‌లో తనిఖీ చేసి చూడగా రెండు కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకులను అదుపులోకి తీసుకొని ఫోర్త్ టౌన్ పోలీసులకు అప్పగించారు.

అనధికార పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు



పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద అడ్డంగా నిలిపిన వాహనాలు



స్ప్రింగ్ రోడ్డు వద్ద రహదారిపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

వినియోగదారులకు తప్పని అవస్థలు

జగదాంబ : పూర్ణా మార్కెట్ సమీపంలో అనధికార పార్కింగ్ పెరిగిపోవడంతో వినియోగదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నగరంలో ఎంతో కీలకమైన ఈ మార్కెట్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తుంటారు. అయితే ఇక్కడ ట్రాఫిక్ అస్తవ్యస్తంగా వుండడంతో మార్కెట్‌లో అడుగుపెట్టేందుకు బెంబేలెత్తిపోతున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పూర్ణామార్కెట్‌కు కీలకమైన స్ప్రింగ్‌రోడ్డు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వుండడమే ప్రధాన సమస్యగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రెండు పోలీస్ స్టేషన్ల సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో కొనుగోలుదారులు తమ ద్విచక్ర వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసేస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. రోజూ గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వ్యాపారులు, నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా స్ప్రింగ్‌రోడ్డులో ఉదయం 10 గంటల తర్వాత భారీ వాహనాల రాకపోకలకు అనుమతులు లేనప్పటికీ టూ టౌన్ పోలీసుల పర్యవేక్షణ లోపం కారణంగా నిత్యం ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుని అనధికార పార్కింగ్‌ను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా భారీ వాహనాల రాకపోకలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

సిరుల తల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళాల నడుమ అమ్మవారు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారులు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన వసతులతో పాఠశాలలు రెడీ



జీవీఎంసీ గణేశ్వరపాఠశాల (నాడు)



జీవీఎంసీ గణేశ్వరపాఠశాల (నేడు)

జగదాంబ: విద్యార్థులను స్వాగతించేందుకు అధునాతన వసతులతో పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దక్షిణ నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు విడుదల చేసింది. వాటిలో భాగంగా జీవీఎంసీ 35వ వార్డులోని గణేశ్వర పాఠశాల, మార్కెట్ వీధిపాఠశాల, తుఫాన్ బిల్డింగ్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఆ నిధులతో భవనాలకు కొత్త హంగులు సమకూర్చారు. విద్యుత్, క్రీడాప్రాంగణం, కిచెన్, తాగునీరు, మరుగుదొడ్లు ఆధునికీకరించారు. ఆహ్లాదకర వాతావరణం కోసం పూలమొక్కలు ఏర్పాటు చేశారు.

చుక్కల జింకల సందడి



కంబాలకొండ రోడ్డు పక్కన పచ్చిక మేస్తున్న చుక్కల జింకలు

అరిలోవ: కంబాలకొండ రిజర్వుడ్ ఫారెస్ట్‌లో కుప్పలుగా జింకలు ఉన్నాయి. సహజసిద్ధమైన అటవీ ప్రాంతం కావడంతో కొండకోనల్లో ఇవి గుంపులుగా తిరుగుతూ కంబాకొండ ఎకో టూరిజం పార్కులోకి చేరి సందర్శకులను అలరిస్తున్నాయి. కొండల నుంచి బయటకు వచ్చిన చుక్కల జింకలు ఇక్కడ ఎక్కువగా తిరుగుతుంటాయి. గంపులుగా కంబాలకొండ కొను వద్దకు చేరుకొని దానిలో నీరు తాగి దాహం తీర్చుకొంటాయి. అనంతరం అన్నీ కలసి మేత కోసం పరుగులెడుతుంటాయి. ఇవి పార్కు లోపల నుంచి జాతీయరహదారిపైకి పచ్చిక మేత కోసం తరుచూ వస్తున్నాయి. చెంగుచెంగున గెంతులు వేస్తూ రహదారిపై వెళుతున్న వాహనచోదకులను కనువిందు చేస్తున్నాయి. కంబాలకొండ పార్కు ముఖ ద్వారం పక్కన ఎక్కువగా ఇవి తిరుగుతూ కనిపిస్తున్నాయి.

ఇలా కొండల నుంచి బయటకు వస్తున్న జింకలు రోడ్డుపై వెలుతున్న వాహనాల శబ్దాలకు బెదిరిపోయి ఒక్కోసారి గాబరాతో పరుగులు తీస్తున్నాయి. ఆ క్రమంలో ఎటు వెళ్లాలో తెలియక రోడ్డు మీద ప్రయాణించే వాహనాలకు అడ్డంపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. గతంలో పలుసార్లు కంబాలకొండ, జూ పార్కు సమీపంలో జాతీయ రహదారిపై పలు జింకలు, అడవి పందులు వాహనాలకు అడ్డంపడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇవి రోడ్డు మీదకు చేరడానికి వీలులేకుండా అటవీశాఖ అధికారులు బలమైన కంచె ఏర్పాటు చేస్తే వాటి ప్రాణాలకు రక్షణ కలుగుతుందని వన్యప్రాణి ప్రేమికులు భావిస్తున్నారు.

కూరగాయల మార్కెట్ల వద్ద పశువుల బెడద



రామకృష్ణ రైతుబజార్ గేటు ముందు ఉన్న పశువులు

జగదాంబ: కూరగాయల మార్కెట్ల వద్ద పశువుల సంచారంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. 35వ వార్డులో పూర్ణామార్కెట్, రామకృష్ణ రైతుబజార్ ఉన్నాయి. పశువులు రోజూ మార్కెట్ నుంచి లోపలికి, బయటికి సంచరిస్తూ ఉండటంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ముఖ్యంగా మహిళలకు అవస్థలు తప్పడం లేదు. ఇటీవల మార్కెట్‌లో ఇద్దరు మహిళలపై పశువులు దాడి చేయడంతో వారు ప్రమాదానికి గురయ్యారని వ్యాపారులు చెబుతున్నారు. ఇంటి వద్ద ఉంచాల్సిన పశువులను పశు యాజమానులు మార్కెట్ పైకి పంపించడంతో అవి దాడి చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. పట్టించుకోవల్సిన జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. దుకాణాల ముందు, మార్కెట్ల ముందు పశువులు ఉండడంతో మార్కెట్ లోపలికి వెళ్లడానికి కూడా భయపడుతూ వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతోపాటు, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, శ్రీవారి నామసంకీర్తన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

- శ్రీవారి ఆలయంలో రెండో శనివారం కావడంతో లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి. 750 గ్రాముల కళ్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువు గల సాధారణ లడ్డూ రూ.50లకు భక్తులకు విక్రయించారు.

'ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిని సస్పెండ్ చేయండి'

దాబాగార్డెన్స్ : కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పోచారం రాకేష్ రెడ్డి హద్దులు మీరుతున్నారని, ఆయన్ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణ డిమాండ్ చేశారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ నాయకుడు మాణిక్యం ఠాకూర్, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని దూషించడం సరికాదన్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడిన రాకేష్‌రెడ్డి కార్యకర్తలను వేధిస్తున్నారని ఆరోపించారు. విశాఖపట్నం సిటీ కార్యాలయం రీ మోడలింగ్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేసి, ట్యాక్సులు కట్టాలని కొందరి నుంచి డబ్బులు వసూలు చేసి సొంత జేబు నింపుకున్నారని ఆరోపించారు. సమావేశంలో జమ్ము ఆదినారాయణ, హైదరాలి షింకా, ఉమ్మడి భాస్కరరావు, తెడ్డు రాంబాబు, టి మధుసూధనరావు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

సీతంపేట: స్వర రాగం అండ్ మెలోడి ఫ్యూజన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహూతులను ఉర్రూతలూగించింది. సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రమేష్, ఎన్.ఎస్.రావు ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ మధురంగా ఆలపించి అలరించారు. రెండు గంటల పాటు నిర్విరామంగా సాగిన సంగీత విభావరి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం అతిథుల చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అల్లిపురం: కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులకు శనివారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులకు పోలియో, కోరింత దగ్గు, హెపటైటిస్ బీలకు సంబంధించిన వ్యాక్సిన్లను వేశారు. చిన్నారుల తల్లులకు వైద్య సిబ్బంది సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నారులకు సమయానికి ఇవ్వాల్సిన వ్యాక్సిన్లు, వారికి ఇవ్వాల్సిన ఆహార పదార్థాల గురించి వివరించారు. హెచ్‌వీ గురులక్ష్మి, నారాయణమ్మ, ఏఎన్‌ఎం మదీనమ్మ, ఆశ వర్కర్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

సాగరతీర స్వచ్ఛతలో ఏయూ విద్యార్థులు



బీచ్ క్లీనింగ్ కార్యక్రమం ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు బీచ్‌క్లీన్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కె బీచ్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 8 గంటలకు వైఎంసీఏ వద్ద ముగిసింది. కార్యక్రమంలో ఏయూ విద్యా ర్థులు, ఎన్‌సీసీఆర్, సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య పి.జానకీరామ్ తదితరులు ప్రసంగించారు. 250 మందికిపైగా వలంటీర్లు పాల్గొని బీచ్‌లో వ్యర్థాలను ఏరివేసి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



పుష్పాలంకరణలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి



ఆలయ ఆవరణలో హోమం జరిపిస్తున్న వేద పండితులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామ కృష్ణ దేవస్థానం ఆవరణలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అష్టోత్తర శతనామార్చన, దివ్య మంగళ నీరాజనం, మంత్రపుష్పాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించి ఫల, పుష్పాదులతో అభిషేకించారు. ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. కార్యక్రమంలో గురుస్వాములు డీవీఎస్ మూర్తి, నీలాపు వెంకట రమణారెడ్డి, ఎల్.ఎ.సుకుమార్‌తో పాటు గ్రంధి రాజేష్, రమ దంపతులు పాల్గొన్నారు.

పరస సత్యనారాయణకు ఘన నివాళులు



సత్యనారాయణ జీవిత విశేషాలతో రూపొందించిన పుస్తకం ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్: మహోన్నత వ్యక్తి పరస సత్యనారాయణ అని సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ కొనియాడారు. సిటూ ఆంధ్ర రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పరస శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి కుమార్, పలువురు సిటూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తులసి, తూర్పు గోదావరి జిల్లా సిటూ ప్రధాన కార్యదర్శి రాజులోవ చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పరస సత్యనారాయణ ఆంధ్ర రాష్ట్ర కార్మిక ఉద్యమంతో మమేకమయ్యారన్నారు. ఆయన జీవితం అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది, సింగరేణి బొగ్గు గనుల్లో ప్రారంభమైన ఆయన ప్రస్థానం రాష్ట్ర కార్మిక ఉద్యమానికి దిక్సూచిగా నడిచిందన్నారు. శత జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని పరస జీవిత విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యు.రామస్వామి, కేఎం కుమార మంగళం, పి.వెంకట్ రెడ్డి, వై.రాజు, జి.అప్పలరాజు, బి.జగన్, ఎం.సుబ్బారావు, యు.రాజు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సత్కారం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో సిబ్బంది

దాబాగార్డెన్స్: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ విద్యార్థులను సంస్థ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. 696 మార్కులతో 2519 ర్యాంకు సాధించిన సత్యశ్రీతోపాటు 32 మందిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీఎస్ మూర్తి మాట్లాడుతూ దేశంలో అత్యున్నత ర్యాంకులు సాధించడంలో ఆకాష్ విద్యార్థులు ముందంజలో ఉన్నారన్నారు. ఆలిండియా స్థాయిలో 20 ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారన్నారు. సంస్థ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వరీ ప్రసాద్, నిశాంత్ మిశ్రా, బ్రాంచ్ హెడ్ రాజేష్ పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగుల తొలగింపు



నక్కవానిపాలెంలో ముసుగులు తొలగించిన తరువాత విగ్రహాలు

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించారు. సాధారణ ఎన్నికలు, కౌంటింగ్ పూర్తి కావడంతో ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఈ చర్యలు చేపట్టారు. సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గురుద్వారా, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో విగ్రహాలకు రాజకీయ నాయకుల ఫొటోలకు వేసిన ముసుగులను తీసివేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించారు.

సమ్మర్ టాలెంట్ షో అదుర్స్



వెస్ట్రన్ డ్యాన్స్‌తో అలరిస్తున్న చిన్నారులు



విజేతలతో నృత్య శిక్షకుడు అరుణ్ సాయి

సీతంపేట: సాయినాథ కళా సమితి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం నిర్వహించిన సమ్మర్ టాలెంట్ షో ఆద్యంతం అలరించింది. సుమారు 40 మంది చిన్నారులు పాల్గొని వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ అరుణ్ సాయికుమార్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా ఆర్ అండ్ బీ వద్ద గల తమ సంస్థలో వెస్ట్రన్, క్లాసికల్, క్లాసికల్ మ్యూజిక్, మెడిటేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏటాలాగే ఈ సారికూడా వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. నెల రోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డ్యాన్సర్ రాజు, నాట్యాచారుడు లలిత్ కుమార్ గుప్తా, అతిథులు చల్లా మంజుల, సూర్యకళ పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అర్చకులు అధిష్ఠంపజేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో స్వామివారి నిత్యకల్యాణాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. అనంతరం ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.